


కోర్టు వాయిదా కెళ్ళొచ్చిన శేషగిరి సాయంత్రం స్నానం ముగించుకుని తీరిగ్గా పేపరు ముందేసుకున్నాడు.

వరదల్లో మునిగిన గ్రామాలను హెలికాప్టర్ నుంచి 'పెద్ద తలకాయలు' తిలకిస్తున్నట్లు పేపరులోని హెడ్డింగ్‌లు చూస్తూ పోతున్నాయి తన కండ్లు. పట్టుమని ఒక్క వార్తయినా చదువలేదు నిజానికి తను చూసే పేపర్లో ఎవరెవరికి, ఏఏ దేశాలకు-ముఖ్యంగా మన దేశానికి ఎన్ని కోట్ల రూపాయల అప్పు లభించే మంచి వార్తలున్నాయో ఏమోగానీ. తనకు మాత్రం చాన్నాళ్ళుగా వేధిస్తున్న కోర్టు పని అనుకూలంగా తీర్పు రావడంతో.... మనసు నిండా తృప్తి.... పేపరులో ఒక్క వార్తా తన దృష్టిని ఆకట్టుకోలేకపోయింది.

తృప్తి.... తృప్తి.... తృప్తి.. గుండె అంచులు దాటి.... ఒంటి నిండా ప్రాకే తృప్తి.

అవును కోర్టుచుట్టూ తను ఎన్నిసార్లు తిరిగాడో.... ఎన్ని చేదు అనుభవాలు ఎదుర్కొన్నా కలత లేని తనకు.... ఆ రోజు.... లేచిన లగాయితూ ఎంత కలవరపడ్డాడని. నిజం చెప్పాలంటే ఆ కలవరంతోటే నిద్ర సరిగ్గాపోలేదని కూడా తెలుసు. అందుకేగా.... అలారం గంట మోగే అసలు టైముకు అరగంట ముందునుంచే తనగుండెకొట్టుకోవటం మొదలైంది

అంతేనా....

లేవగానే తనకు తుమ్ము వచ్చినట్లుగా వుంటే.... అది రాకుండా ముక్కు నలుచుకొనీ.... మూతి విరుచుకొనీ.... నానా హైరానాపడ్డాడు. అటువంటిది, దొడ్లోకి వెళ్ళివెళ్ళటంతో.... మ్యావ్.... మంటూ ఒళ్ళిరుచుకుంటూ లేచి ఎదురుపడిన నల్లపిల్లిని చూసేసరికి అరికాలి మంట నెత్తికెక్కింది.... తిట్టిన తిట్టు తిట్టకుండా తన చేతిలోని టూత్‌బ్రష్‌ను కసికొద్దీ దాని మీద విసిరేశాడు.




సృష్టిలో పిల్లిజాతి చేసుకున్న పాపమేమిటో.... పులి జాతిలో చేరినా!!

భయం.... భయం.... కదిత్తే భయం.. మెదిత్తే భయమేసింది శేషగిరికి. కోర్టు కేసులో తీర్పు తనకు అనుకూలంగా వస్తుందో.... లేదో నన్న భయం కాళ్ళకింద తన వకీలు "ఫర్వాలేదు.. భయపడకయ్యా వూరికే నువ్వు" అని యిచ్చిన అభయ హస్తాలెన్నో.... చిత్తు చిత్తుగా నలిగిపోయాయి.

అందునా.... తను పీల్చేగాలిలో ఆక్సిజన్ కన్నా.... అపనమ్మకం పాలెక్కువాయె మరి

క్రితంసారి.... వాయిదాకు ఆలస్యంగా వెళ్ళినందుకు తన వకీలు.... తనపై విరుచుకు పడ్డప్పుడు... అనుభవించిన మానసిక క్షోభ.. నెలరోజులవుతున్నా, చెక్కు చెదరక అమరావతీ స్థూపంలా అలాగే వుంది. అందుకే ఈసారయినా బస్సు వేళకంటే ముందుగా లేచి.. పట్నంలో కోర్టుకు పయనమవుదామనుకునే ప్రయత్నంలోనేగా.. ఈ వెధవ పిల్లి.... అడ్డమొచ్చింది.

మనసు బాగా కీడు శంకించింది.

ఛీ'.... ఛీ!! ఛీ.... ఛీ !! అని వందల సార్లు అనిపించింది. నల్లపిల్లి.

పాలూ, పెరుగూ బతకనియ్యకపోవటం ఎలాగూ అటుంచి, ఎంతో మోజుపడే మినపగారెల్ని నేతిలో స్నానం చేయించి సంతుష్టిగా తిందామని.... ఖరీదెక్కువ పెట్టి తెచ్చిన కమ్మని ఆవునెయ్యి.... ఈ వెధవ నల్లపిల్లి పొట్టనబెట్టుకున్నపుడు.

"ఆ దరిద్రపు పిల్లిని, దొంగ పిల్లిని.. ఆ దిక్కుమాలిన పిల్లినెందుకు పెంచుతారండీ!" సముద్ర మథనంలో పుట్టిన కాలకూట విషంలాంటి.... విసుగులో పుట్టిన కోపం పట్టలేక.. సదరు నల్లపిల్లి యజమాని ప్రస్తుతం తను అద్దెకుంటున్న కొంప యజమాని అయిన పరంధామయ్యతో అన్నాడు శేషగిరి.


"ఎలుకలు.. ఎలుకలయ్యా. ఈ వెధవ ముండా ఎలుకల పీడ వదిలించుకోవటానికి తేలికోపాయం. పిల్లిని పెంచుకోక మరేం చెయ్యమంటారు చెప్పండీ!! ఆ ఎలుకలను తినీ.. తినీ మొహం మొత్తిందేమో.... వాడవాడంతా గప్పున గుబాళించే మీ ఆవునెయ్యి మీదకు గాలి మళ్ళివుంటుంది మా పిచ్చిముండకు!" అని వూరి వూరికీ ఉక్కు

ఫ్యాక్టరీ పెట్టిస్తానన్న రాజకీయ నాయకుడిలా తేలిగ్గా చెప్పి తీరిగ్గా వెళ్ళకిలిస్తున్న పరంధామయ్యను చూసేసరికి వచ్చడి బండ తీసి మొహాన కొట్టాలనిపించింది తనకు- అయినా అంత పని చేయలేడు.

అసలే తనకు అనుమానం పాలెక్కువని. పైగా ఛాదస్త్రం దానికి తోడని.. తిధి. వార. నక్షత్ర. రాహుకాల వర్జాల ప్రియుడని.. కోర్టు పక్షసి. తుమ్మినా దగ్గినా ఎక్కడలేని పట్టింపుల శకునపక్షినీ.... చాటుగా నేటుగా అంతా అనటం గుర్తుకు రావటంతో పండ్లతో చే కారాలు మిరియాలు నూరబోయి ఎందుకైనా మంచిదని ఆలోచించుకుని వాళ్ళన్న మాటల్లో కొంత నిజమున్నదని గ్రహించటం మూలాన్నే ఎంత కోపమున్నా కోరలు పీకిన పాములా వుంటాడు శేషగిరి.

అయితే మాత్రం ఆ నల్లపిల్లి. ఆ గుడ్లపిల్లి. దొంగ పిల్లి- ఆ దరిద్రపు పిల్లి, దిక్కుమాలిన పిల్లి. దిబ్బమొహం పిల్లి పొద్దున్నే తగుదునమ్మాయంటూ దాని మొఖం తాను. తన మొఖం అది.. తొలుదొలతగా చూసుకోను మీసాలు దువ్వుకుంటూ రావటం చూసేసరికి....





## జీవిత వివరాలు

26 సంవత్సరాల వయస్సుతో బి.ఎ. డిగ్రీ తీసుకుని ఖమ్మం ఫారెస్ట్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నేనింకా అవివాహితుణ్ణి.

సాహిత్య సంగీతాలంటే మక్కువ. మంచి స్నేహితానికి ఎక్కువ విలువనిస్తాను. శరీర సౌష్ఠవ పోటీల్లో పొందిన అనేక బహుమతులు చూసుకున్నపుడెల్లా.... అవిటివాణ్ణనే బాధ మర్చిపోతుంటాను. ఈ వికలాంగుల సంవత్సరంలో నాకు గుర్తింపు రావాలని. సాహిత్యంలో చేసిన నా తొలి కృషికి ప్రోత్సాహమిచ్చిన నా ప్రియమిత్రుడు కె జగదీశ్వరరావుకు యెంతైనా ఋణపడి వుంటాను.

—సాధనాల అలెగ్జాండర్

ఇహ ఈ రోజు కోర్టు కేసు మొత్తం కాల్లేరయిపోవటం ఖాయమనుకున్నాడు.

కానీ చిత్రం. విచిత్రం అంతా చిత్ర విచిత్రం. తన అనుమానాలన్నీ తారుమారయ్యాయి. వార బలం వట్టిపోయింది. తిథి.. నక్షత్రాలు తీర్థంలో కలిశాయి. రాహుకాల బాహువు విరిగిపోయాయి. వర్జ్యప్రభావం వ్యర్థమైపోయింది.... తీర్పు తనకు అనుకూలంగా రావటంతో!.... భలే!! ఆ రోజు.... వెళ్ళి.... వెళ్ళగానే బస్సు.... బస్సెక్కాడు.... సమయానికొచ్చిన క్లైయింట్‌ను చూసి వకీలుగారి కీలుకీలు కిలకిలా నవ్వుతూ నాట్యాలు చేశాయి. కత్తులబోనులా కనిపించేకోర్టు, ఇంద్రభవనంలా తోచింది. కట్టెసుత్తితో గటిగా బల్లగుద్దే జడ్జి జగన్నాథం.... తన పెళ్ళాం చిన తమ్ముడు జనార్దనంగా మారి చెప్పినట్లు విన్నట్లయింది. తన ప్రత్యర్థి వకీలు వీరభద్రయ్య వటి భద్రయ్యాయ్యాడు. తన వకీలు సహనమూర్తి నరసింహ్వ మూర్తిగామారి పెద్ద పెద్ద పుస్తకాలు శోధించి మస్తకాన్ని మథించి కేసు తన కనుకూలంగా వచ్చేట్లు వాదించాడు- సాధించాడు. అందుకే

గొంతులో జారుతున్న కమ్మని కాఫీ.. నోటినిండా రింగులు తిరుగుతున్న వర్జీనియా పొగాకు పొగ తనకు అధిక శక్తి నిస్తుంటే-

ఇన్నాళ్ళుగా కోర్టులో వుండి బీడు బోయిన పదెకరాల మాగాణి పంటతో నిండి. కడుపుతో వుండి పుట్టింటి కెళ్ళిన తన భార్య కల్యాణిలా కన్పించింది. పుట్టబోయే పురిటికందు అదృష్టదీపుడు. ఇహ తను తన భార్య కల్యాణి శ్రీదేవియై కాళ్ళు పత్తుతుండగా శేషపాన్పుపై శయనిస్తున్న శేషగిరి వాసుడు. కూచున్న కుర్చీ ఇంద్రసింహాసనం.... తాగుతున్న కాఫీ అమృతం. పీలుస్తున్న పొగ కస్తూరి సౌగంధికా పరిమళాలు.

విన్నావా....మా పిల్లి మా నల్ల పిల్లి ఓహో ...... ఓహోహో ....తృప్తి! తృప్తి!! ఒళ్ళంతా నిండిన తృప్తి.... ఇల్లంతా పారుతున్నట్లున్న వూహాలోకంలో పయనిస్తున్న తన దారికి మళ్ళీ నల్లపిల్లి అడ్డమొచ్చింది.... నల్లపిల్లి.... న....ల్ల....పి....ల్లి!! కాదు ......అది కృష్ణమార్జాలం .... దానిగ్రుడ్లు....సూర్యచంద్రులు! మీసాలు....తూనీగలు!!

తను తిట్టిన తిట్లు... తిట్లుకావవి.... భక్తితో.. శక్తికొద్దీ వర్ణించిన....మార్జాల దండకం!!! నవ్వు....నవ్వు....నవ్వొస్తుంది....నవ్వుల దొంతరలతో బంతులాడబోయేసరికి.

"శేషయ్యా....శేషయ్యా...." అంటూ హడావుడిగా పరంధామయ్య రావటంతో తను నవ్వకముందే, అంత భయపడుతున్నాడా ఏమిటన్నట్లు చూశాడు శేషగిరి.

"విన్నావా.... మా పిల్లి, మా నల్ల పిల్లి చచ్చిపోయిందయ్యా! పొద్దున్న.... ఏలం.... కొ.... మొహం చూసిందో— ఏమో వూరకుక్కల బారిన పడి చచ్చిపోయిందయ్యా" అంటూ కంటతడి పెట్టూ కూలబడ్డాడు పక్క కుర్చీలో.

'అలా తిట్టకయ్యా బాబూ!'అని చెప్పబోయి తెరచిన శేషగిరి నోటి నుంచి ఫ్యాక్టరీ గొట్టం నుంచి వచ్చే పొగలా.. సిగరెట్ పొగ తప్ప మాట మాత్రం బైటకి రాలేదు.

# ఇంద్ర ధనుస్సు:

## జలుబుకు మందు!

"మందులు వాడితే వారానికి, లేకపోతే ఏడు రోజులకూ జలుబు తగ్గుతుంది" అని ఓ ఇంగ్లీషు సామెత. కానీ ఇప్పుడు ఇంగ్లండులోని మెడికల్ రిసెర్చి కౌన్సిల్ వారు జలుబుకు మందు కనిపెట్టామంటున్నారు. "ఇంటర్ ఫెరాన్"అనే మందును గతంలో కాన్సర్ నివారణకు వినియోగించవచ్చన్నారు. ఇప్పుడు జలుబు నివారణకు కూడా పనికి వస్తుందని ఆ మందును "స్ప్రే" రూపంలో తయారు చేస్తున్నారట. "ఎన్విరాక్సైమ్" అనే మరో మందునుకూడా ఇలాగే "స్ప్రే" రూపంలో తయారుచేస్తున్నారట. అబ్బో జలుబుకు ఎన్ని మందులో ఇక!

## నేరస్థుల ధ్యానం!

గౌహతి జిల్లా జైలులోని జీవిత ఖైదీలు పాతికమందికి భావాతీత ధ్యానం (ట్రాన్సెండెంటల్ మెడిటేషన్) బోధించారట. అలా చెయ్యటంవల్ల మంచి ఫలితాలు కనిపించాయనికూడా అంటున్నారు. ఈ ఖైదీలంతా ఇప్పుడు తోటి ఖైదీలతో సామరస్యంగాఉంటూ బాధలూ ఉద్రిక్తతా లేకుండా హాయిగా జీవిస్తున్నారట. నేరస్తులలో పరివర్తన కలిగించేందుకు అనుసరించే పద్ధతులలో ఇది అరుదైనది.

## దిగంబర లక్ష్యం

ఇటీవల స్విస్ స్త్రీల హక్కుల సంఘం ఒక రగడ లేవదీసింది. కొందరు స్విస్ సైనికులు "ప్లేబాయ్" పత్రికలో ప్రచురించిన లైఫ్‌సైజు దిగంబర స్త్రీ చిత్రం ఒక దానిని తుపాకీ పేల్చడానికి లక్ష్యంగా ఉపయోగించిన విషయమే! అలా చేయటం స్త్రీలగౌరవానికి భంగం కలిగించేదిగా ఉందని వారు పేర్కొన్నారు.

అసోసియేషన్ ఆ సైనికులపై ఒకపిటిషన్ దాఖలు చేసింది. రెండు క్రిందికోర్టులలో తిరస్కరింపబడిన ఆ పిటిషన్‌ను చివరికి బెర్నెసుప్రీమ్‌కోర్టుస్వీకరించింది. చివరికి న్యాయమూర్తులు ఒక పత్రికకు దిగంబరంగా పోజులు ఇచ్చే మోడల్ గర్ల్స్ "మొత్తంస్త్రీలందరికీ ప్రతినిధికాజాలదు" అన్నారు. మరి ఇప్పుడు ఆ మహిళామణులు ఏం చెయ్యదలిచారో!

—పరిటాల దుర్గామల్లేశ్వరి